శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## వైభవంగా జొన్నవాడ కామాక్షితాయి కళ్యాణం



**బుచ్చి జులై 16 ప్రభా తవార్త** పవిత్ర పుణ్య క్షేత్ర మైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో నిత్య కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. అలాగే నవావరణ పూజ కార్యక్ర మాన్ని నిర్వ హించారు. అర్చ కుల వేదమంత్రోచ్చరణ నడుమ స్వామి అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ఉభయ కర్తలుగా నెల్లూరు కార్పోరేషన్ 8 వార్డు కార్పోరేటర్ ఎం.కామాక్షిదేవి బిఎబిఎల్, డాక్టర్ కళాప్రసన్నగుప్తా వ్యవహారించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గోన్నారు. కార్యక్రమాలను ఆల య చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, పుట్టా లక్ష్మీకాంతమ్మ, ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## బోగోలులో పోలేరమ్మకు ప్రత్యేక కుంకుమార్చన



**బిట్రగుంట, జులై 16 ప్రభా తవార్త** బోగోలు మేజర్ పం చాయతీలోని దళితవాడలో ఆ షాడ మాసం చివరి ఆదివారం కావడంతో పోలేరమ్మకు ప్రత్యేకకుంకుమార్చన, పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే సతీమణి రామిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపిపి మేకల సుజాత, జెడ్పీ టీసీ మద్దిబోయిన కీర్తన, మాజీ ఎంపిపి సులోచనమ్మ, మండల పార్టీకన్వీనర్ మద్దిబోయినవీరరఘు, పార్టీనేతలు టి.పెంచల య్య, టి.ర మణ య్యనాయుడు, పి.అంకులయ్య, పాశంరవీంద్రబాబు, మేకలశ్రీనివాసు లు, ఎ.కె. సుంద ర్‌రాజ్, కర్తం సురేంద్రరెడ్డి, గందూరుశ్రీనివాసులు, కుందుర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సత్వరం పూర్తి చేయాలి




**నెల్లూరు అర్బన్, జులై 16, ప్రభాతవార్త** ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన సర్వేపల్లి నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అంబటి రాంబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్‌లతో కలిసి సర్వేపల్లి నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గృహ నిర్మాణ సంస్థ, రోడ్లు భవనాలు, విద్య, వైద్యారోగ్య శాఖ విద్యుత్, జలవనరుల శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును శాఖల వారీగా సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను, సంక్షేమ పథకాలను సత్వరం పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు సంపూర్ణంగా అందాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల స్థాయిలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రుల అధ్యక్షతన సమీక్షా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఆదివారం తొలి రోజు సర్వేపల్లి నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించుకుంటూ ఈ నియోజకవర్గంలో అమలు చేసున్న అభివృద్ధి కార్యక్రమాల అమలును సమీక్షించుకొని, ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ఆ పనులు జిల్లా స్థాయిలో పరిష్కారం అయితే జిల్లా స్థాయిలో పరిష్కరించడం, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటే రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా కృషి చేయడం జరుగుతుందని మంత్రి అంబాటి రాంబాబు అన్నారు. ప్రజలకు మంచి జరిగేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అందులో జగనన్న సురక్ష ఒకటని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల గుర్తింపు పత్రాలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందకపోతే వాటిని తెలుసుకొని వాటిని ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదవారి సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో పెద్దఎత్తన జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఇల్లు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టిందని, అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకొని సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని అన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న ప్రాధాన్యత భవనాలు, రోడ్లు, సాగునీటి కాలువల పనులు, నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. పనులను పూర్తి చేయడం ఎంత ముఖ్యమో, సంబంధిత బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి నియోజకవర్గ సమీక్షా సమావేశాలు నిర్వహించుకొని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను నియోజకవర్గ స్థాయి సమీక్షించుకొని జిల్లా పరిధిలో పరిష్కారం అయితే జిల్లా స్థాయిలో, జిల్లా పరిధిలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేలా ఈ రోజు సర్వేపల్లి నియోజకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఎఫ్ఓ చంద్రశేఖరరావు, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, పంచాయతీ రాజ్ ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, సోమశిల, తెలుగు గంగ ప్రాజెక్ట ఎస్ఈలు అశోక్‌కుమార్, రంగవరప్రసాద్, కృష్ణమోహన్, వెంకట రమణారెడ్డి, హరినారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ల డెకాయిటీ దొంగలు ఐదు మంది అరెస్ట్



**కావలి, జులై 16 ప్రభాతవార్త** పట్టపగలు ఐదు మంది రెండు మోటార్‌బైక్‌లపై సముద్రతీరం వద్దకు వచ్చి ఒక వ్యక్తిని దాడి చేసి 6 లక్షల రూపాయల విలువ కల్గిన 23 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు దోపిడీ చేసిన ఉదంతం కావలి ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది. భయానక వాతావరణం కల్గింది. దోపిడీకి పాల్పడిన ఐదు మందిని కావలి పోలీసులు అరెస్ట్ చేసి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాడి చేసి దోపిడీ చేసిన దుండగుల పట్టివేత వివరాలను డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. ఈ నెల 14వ తేది మధ్యాహ్నం టాటా మాజిక్ ఆటోలో డ్రైవర్ పాశం యశ్వంత్ కావలి రైల్వే స్టేషన్ నుంచి పది మంది ప్రయాణికులతో కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సముద్ర బీచ్‌కి బాడుగకు వెళ్లాడు. పది మంది సముద్రంలో స్నానం చేసేందుకు వెళుతూ 23 సెల్‌ఫోన్లను ఆటో డ్రైవర్‌కి కవర్‌లో పెట్టి ఇచ్చారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఐదుగురు వ్యక్తులు రెండు మోటార్‌సైకిళ్ళపై తుమ్మలపెంట సముద్రం వద్దకు వెళ్లారు. ఆటో డ్రైవర్‌ని ఈ ఐదు మంది చుట్టుముట్టి ప్రయాణికులు నీ దగ్గర వుంచినవి చూపించాలని దౌర్జన్యం చేశారని డిఎస్పీ తెలిపారు. యశ్వంత్ చూపించకపోవడంతో దాడి చేసి చంపుతామని బెదిరించి అతని వద్ద ప్రయాణికులు వుంచిన 23 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లరు దుండగులు దోపిడీ చేసి పరారైనట్లు డిఎస్పీ తెలిపారు. డ్రైవర్ ఫిర్యాదును పురస్కరించుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అడిషినల్ ఎస్పీ(అడ్మిన్) డి.హిమవతి పర్యవేక్షణలో కావలి డిఎస్పీ వెంకట రమణ ఆధ్వర్యంలో రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యం.రాజేష్ పోలీస్ సిబ్బందితో దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాబడిన సమాచారం మేరకు ముసునూరులోని మాగుంట పార్వతమ్మ గెస్ట్‌హౌస్ సమీపంలో నేషనల్ హైవే ప్లైవోవర్ అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఈ దుండగుల్ని పట్టుకొని దోపిడీ చేసిన 23 సెల్‌ఫోన్లను, నేరానికి ఉపయోగించిన రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ వెంకట రమణ తెలిపారు.

**దాడి చేసి దోపిడీ చేసిన దుండగులు వీరే...** తుమ్మలపెంట సముద్రం వద్ద ఆటో డ్రైవర్‌పై దాడి చేసి 23 సెల్‌ఫోన్లు దోపిడీ చేసిన ఐదు మంది దుండగులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేటకు చెందిన గుర్రంకొండ సాల్మన్, ఇదే మండలం బేతనీయపేటకు చెందిన మల్లి సిద్దేశ్వరరావు, చెంచులక్ష్మీపురంకు చెందిన కట్టా మనోహర్, కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన చెన్నంశెట్టి కుమార్, కావలి జనతాపేటకు చెందిన పాలకీర్తి సుబ్రమణ్యంలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. గుర్రంకొండ సాల్మన్, మల్లి సిద్దేశ్వరరావులపై బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో నేరస్తులే వున్నారని డిఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ రాజేష్, ఎస్ఐ సుమన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్స్ అందజేత



**నెల్లూరు క్రైమ్, జులై 16, ప్రభాతవార్త** నగరంలోని స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలన వద్ద ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ పోలీసులకు 30 ఏసీ హెల్మెట్లను జిల్లా ఎస్పీ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండలో నిలబడి దుమ్ము, దూళి లెక్కచేయకుండా జిల్లాలోని ట్రాఫిక్ సిబ్బంది కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని, వారికి ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నపోలీసులకు ఉపశమనం కలిగించేందుకు నాణ్యమైన, విలువైన ఏసీ హెల్మెట్లు అందించారు. పోలీసు శాఖకు ఎటువంటి తోడ్పాటు అందించడానికైనా సిద్దంగా ఉన్నానని తెలిపారు. పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి దాతృత్వానికి పోలీసు శాఖ తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపి జిల్లా ఎస్పీ సత్కరించారు. ప్రయోగాత్మకంగా అందించిన ఏసీ హెల్మెట్స్ విధుల్లోఆటంకం లేకుండా అనువుగా ఉంటే వాటి పని తీరును బట్టి ఎండలో విధులు నిర్వహించే పోలీసులందరికి ఏసీ హెల్మెట్లు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమమే పరమావదిగా, ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బంది పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నామని ఆదాల పేర్కొన్నారు. మా సంక్షేమంలో ఎంతో శ్రద్ద తీసుకుంటూ నాణ్యమైన హెల్మెట్స్ అందిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వం రెడ్డికి, ఎంపీ ఆదాలకు సంతోషంతో ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) హిమవతి, ట్రాఫిక్ డీఎస్పీ సుభాన్‌భాష, ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు ఋణపడిఉంటా



**ముత్తుకూరు, జూలై16, ప్రభాతవార్త** నా శరీరంలోని చివరిబొట్టు వరకు సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నేలటూరులోని ఏపి జన్కో ఆవరణలో ఉన్న నాగాలమ్మ గుడిలో స్థానిక నాయకుడు సీపారెడ్డి రామ్మోహన్‌రెడ్డి తనయుడు జానకిరామిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైయస్సార్ పార్టీ అధికారంలోకి రవాలని ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నన్ను గెలవాలని స్థానిక నాయకులందరూ కలిసి నాగాలమ్మకు పూజలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో సీఎం జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసినందుకు, నన్ను రెండుసార్లు సర్వేపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు స్థానిక నాయకుడు రామ్మోహన్‌రెడ్డి అమ్మవారిని వేడుకోవడంతో ఆ మొక్కును ఈ రోజు తీర్చుకోవడం జరిగిందన్నారు. మరలా అమ్మవారి ఆశీస్సులతో ఆంధ్రరాష్ట్ర శాశ్వత ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని, అలాగే సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలందరూ నన్ను ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. దువ్వూరు విశ్వ మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ గండవరపు సుగుణ, నాయకులు ఆలపాక సీనయ్య, బ్రహ్మానందం, సూరి, దయాకర్‌రెడ్డి, అగ్ని, జనార్ధన్‌రెడ్డి, మునుకూరు జనార్ధన్‌రెడ్డి, నేలటూరు స్థానిక ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాపుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత



**నెల్లూరు కార్పొరేషన్, జులై 16, ప్రభాతవార్త** అన్ని వర్గాలతో పాటు కాపుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాపుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో రూ.6.15 కోట్లతో నూతనంగా నిర్మించిన కాపు భవన్‌ను అంబటి రాంబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లడుతూ రాష్ట్రంలో అత్యధిక సంఖ్య గల కాపులకు కూడా కాపు నేస్తం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని చెప్పారు. రాజకీయ పదువుల్లో కూడా కాపులకు ముఖ్యమంత్రికే దక్కిందని చెప్పారు. రాజకీయ పదువుల్లో కూడా కాపులకు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, కాపుల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి కాపు భవనానికి తమ ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రారంభించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకిణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పునరుద్ఘటించారు. రాష్ట్రంలో అతి పెద్ద సామాజిక వర్గం కాపు సామాజిక వర్గమని, దక్షిణ భారతదేశంలో కాపు సామాజిక వర్గం భాగా విస్తరించిందని, ఈ సామాజిక వర్గం సంక్షేమానికి కూడా ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కాపులు అంటే దేశ సంరక్షణకు కాపు కాసేవారని, వివాదాలకు దూరంగా ఉంటారని పరిపాలన, వ్యాపారం, వ్యవసాయం రంగాల్లో రాణిస్తూ, సమాజంలో ఏకతాటిపై ఉంటూ అందరిని కలుపుకొని ముందుకెళ్తారన్నారు. కాపులందరూ ఐక్యమత్యంగా నెల్లూరు జిల్లాలో కాపు భవన్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. కాపు భవన్ మరింత అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు కూడా మంజూరయ్యేలా కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో బీసీ భవన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కాపు భవన్‌లో భోజనశాల ఏర్పాటుకు రూ.50లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు జిల్లా కాపుల చిరకాల కోరిక అయిన కాపు భవన్‌ను ప్రాంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే జిల్లాలో బీసీ భవన్ ఏర్పాటుకుకూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాపు భవనం ఏర్పాటుకు ప్రభుత్వం ఉదారంగా మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, అందమైన భవనాన్ని నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి నారాయణ ఈ భవన నిర్మాణానికి కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారని, వారిని కూడా ఈ సందర్భ:గా అభినందిస్తున్నట్లు ఆదాల చెప్పారు. భవిష్యత్తులో ఈ భవనం అందరికి ఉపయోగపడేలా మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. తొలుత కాపు భవన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు స్థానిక నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాపు భవన్ ప్రారంభోత్సవ శిలా ఫలకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వికాస్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిబాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, విజయ డెయిరి చైర్మన్ కొండారెడ్డి, రంగారెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి, జిల్లా కాపు సంఘ నాయకులు పిండి సురేష్, సిరి శ్రీనివాస్, భూపతి విజయ, రాఘవ, ఆహ్వాన కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాదయాత్రకు ఘనస్వాగతం పలికిన నేతలు



**వలేటివారిపాలెం జూలై 16, ప్రభాతవార్త** తెలుగు దేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రను ఆదివారం వలేటివారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. లింగసముద్రం మండలం వెంగళాపురం నుంచ సాయంత్రం 4గం॥లకు లోకేష పాదయాత్ర ప్రారంభమైంది. బంగారక్కపాలెం గాందినగర్ స్టేజీలు వద్ద తెదేపా నాయకులు మహిళా కార్యకర్తలు లోకేష్‌కు నీరాజనం పలికారు. తొలుత తెదేపా ఇన్‌చార్జ్జి ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరామ్, ఇంటూరి రాజేష్, కోటపాటి జనార్ధనరావు, ఎం.ఎం కొండయ్య, దామచర్ల జనార్ధన్, నూకసాని బాలాజి, మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తదితరులు యువనేతను ఘనస్వాగతం పలికారు. మహిళా కార్యకర్తల డప్పువాయిద్యాలు బాణా సంచాలతో స్వాగతించారు. వందలాది కార్యకర్తల వెంట నడిచారు. మహిళలు హారతిలు ఇచ్చారు. దారిపోడువునా ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్‌లు యువనేత లోకేష్‌ను స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన ప్లెక్సీలు ఆకర్షణగా నిలిచాయి. వలేటివారిపాలెంలో బస్టాండు సెంటర్‌నుంచి అంకభూపాలపురం రోడ్డు వరకు రోడ్డును సభాస్థలి నిమిత్తం ఏర్పాటు చేశారు. ఇరువైపు బారీ ప్లెక్సీలు కటౌట్లుతో రోడ్డుంతా నిండిపోయింది. బస్టాండు ప్రాంగణం అంతా పసుపు మయం అయింది. సాయంకాలం 6గ॥ ప్రాంతంలో లోకేష్ బహిరంగ సభలో పాల్గొన్నారు. కందుకూరు కథం తొక్కిందనడంతో సభలో హర్షద్వానాలు మారు మ్రోగాయి. లోకేష్ కాన్వాయ్‌కి ముందే దివి శివరామ్ వేదిక మీదకి వచ్చారు. కాబోయే ముఖ్యమంత్రి లోకేష్ అన్నారు. ఇన్‌చార్జీ ప్రసంగంలో కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఇన్నెళ్లుగా ఎమ్మెల్యేగా గెలుస్తూ నియోజకవర్గానికి చేసిందేమిలేదని ఆరోపించారు. తనకు ఈసారి అవకాశం ఇవ్వాలన్నారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన ఈ సమావేశానికి సమీప గ్రామాల నుంచి ప్రజలు బారీగా తరలివచ్చారు. చుండిలో మండల కోశాధికారి చెరువుపల్లి సాంబయ్య, పోలినేని చెరువులో పార్టీ అధ్యక్షుడు శనివారం మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో జనం ట్రాక్టర్లలో తరలివచ్చారు. దారి పోడువనా మహిళలు లోకేష్‌తో మాట్లాడడానికి, సెల్ఫీలు దిగడానికి కరచాలనం చేయడానికి ఎగబడ్డారు. సాయంకాలం 7.30గ॥లకు సమావేశం ముగిసింది. సభా నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికి పేరుపేరునా ఇన్‌చార్జ్జి ఇంటూరి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# కందుకూరు పార్టీ స్థితిగతులపై లోకేష్ ఆరా!

### ఈ సారి కందుకూరులో పార్టీ జెండా ఎగరాలి

**కందుకూరు, జూలై16, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ స్థితిగతులపై ఆరా తీశారు. ఆదివారం ఆయన విడిది కేంద్రంలో నియోజకవర్గంలో పార్టీ ఎందుకు గెలవలేకపోతుందో అనే అంశంపై సుధీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. లింగసముద్రం మండలం వెంగళాపురం విడిది కేంద్రంలో ఆదివారం సాయంత్రం వరకు ఆయన బస చేశారు. ఆయన ప్రత్యేకంగా కందుకూరు పార్టీ వ్యవహారాలపై వచ్చిన వారితో చర్చించినట్లు తెలిసింది. టిడిపి ఇన్‌చార్జ్ ఇంటూరినాగేశ్వరరావు, ఆ పార్టీ నేతలు ఇంటూరి రాజేష్, శాసన మండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, మాజీ శాసనసభ్యులు పోతల రామారావు, దివి శివరాం, సీనియర్ నేతలు చల్లా శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు నేతలతో సమావేశమైయ్యారు. అనంతరం ప్రత్యేకంగా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం గెలవడానికి ఇక్కడ నేతలు ఎలా ప్రవర్తించాలో దిశ, దశ నిర్ధేశించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వేగుల ద్వారా సేకరించిన సమాచారం పార్టీ పెద్దలు అందించిన వర్తమానం, నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను ఆయన క్రోడీకరించి నేతలకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. నేతలతో మాట్లాడే సందర్భంలో గతంలో ఈ ప్రాంతంలో జరిగిన కొన్ని పరిణామాలు, నాయకుల వ్యవహారశైలి, కార్యకర్తలను పట్టించుకోకపోవడం, మెజారిటీ వర్గాల ప్రజలను దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేయకపోవడం ఇన్నేళ్లు ఇక్కడ పార్టీ జెండా ఎగరకపోవడానికి కారణాలని ఆయన గుర్తించారు. ఇటీవల పార్టీ సర్వే చేయించింది. అందులో టిడిపి కార్యకర్తల అభిప్రాయాలు, నియోజకవర్గ ప్రజానీకానికి పార్టీపై ఉన్న అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని పూర్తి స్థాయిలో ప్రక్షాళణ చేసేందుకు లోకేష్ ప్రయత్నించడానికి పాదయాత్రలో సమయం కేటాయించారు. నేతల కలహాలు, కార్యకర్తలతో వ్యవహరిస్తున్న తీరు అందరూ ఒక తాటిపైకి రాలేకపోవడం నేతల తప్పిదమేనని సర్వేలో తేలడంతో ఆయన పార్టీ స్థితిపై ఒక అభిప్రాయానికి వచ్చారు. మరో 8నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో ఇప్పుడు పనిచేస్తున్న నేతలందరూ ఒక తాటిపై ఉండి విజయపందాలో పార్టీని నడిపించాలని లోకేష్ నియోజకవర్గ నేతలకు హితబోద చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో 2024ఎన్నికల్లో ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్ధి గెలుపొందాల్సిందేనని తనను కలిసిన నేతలకు గట్టిగా చెప్పినట్లు పలువురు నేతులు పేర్కొంటున్నారు. అలాగే పార్టీ అభ్యర్ధిని గెలిపించిన వారు కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలబడిన వారిని గుర్తించి పార్టీ తగినప్రాధన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసిపోయి ప్రజలకు కలుపుకుని ఓట్ల రూపంలో పార్టీ వైపు తిప్పుకోవాలని సూచించారు. ఇక్కడ పార్టీని గెలిపిస్తే గతంకంటే మెండుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పరిశ్రమలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువకులకు ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తామని చెప్పారు. అలాగే ఇప్పటిదాకా పార్టీకి దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసిలలోని కొన్ని వర్గాలను దగ్గరకు తీసుకుంటే సునాయాసంగా ఇక్కడ పార్టీ గెలుస్తుందని ఆవైపు దృష్టి పెట్టాలని లోకేష్ స్థానిక నాయకులను కోరారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలన్ని వర్తింపజేయాలి




**బిట్రగుంట, జులై 16 ప్రభాతవార్త** భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్ని పూర్తి స్థాయిలో వర్తింపజేయాలని జిల్లా సిఐటియు ఉపాధ్యక్షురాలు ఎస్.కె.రెహానాబేగం డిమాండ్ చేశారు. మండల కేంద్ర మైన బోగోలులోని సిపియం కార్యాలయంలో ఆదివారం మండల సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక, సి మెంటు, ఇంటి సామాగ్రి ధరలు తగ్గించి భవన నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని తద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. తాపీ కార్మికుల కూలీ రేట్లను కూడా పెం చాల్సి న అవసరం వుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఉపాధ్యక్షులు ఎస్.కె.చాన్‌బాషా, సిఐటియు కావలి నేత పసుపులేటి పెంచలయ్య, మండల సిఐటియు కార్యదర్శి సి.నర హరి, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.కె.బాదుల్లా, మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు యం.మోహన్‌రావు, కృష్ణయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన కాటా శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు



**కావలి రూరల్, జులై 16 ప్రభాతవార్త** కెఎస్ఆర్ డెవలపర్స్ అధినేత, కావలి వ్యవ సాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, ప్రము ఖ రియల్టర్ కాటా శ్రీనివాసులురెడ్డి జన్మదిన వే డుకలు కావలి రూరల్ మండలంలోని ఆము దాలదిన్నె సమీపాన వున్న ఆయన వెంచర్‌లో అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు, వైసిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహిం చారు. కాటా శ్రీనివాసులురెడ్డికి పలువురు పూలబొకెలు అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి తమ అభి మానాన్ని చాటుకున్నారు. విద్యుత్ దీపాలు, అడుగడుగనా ఫ్లెక్సీలు, భారీ బాణాసంచా శబ్దాలతో ఆ ప్రాంత మంతా అందరిని ఆకట్టుకుంది. భారీ కేక్‌ను కట్ చేసి కాటా శ్రీనివాసులురెడ్డికి తినిపించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. భారీ స్థాయిలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం పలువురిని ఆకర్షించింది.

## కాపు భవన్ ప్రారంభోత్సవానికి తరలివెళ్లిన కావలి డివిజన్ బీస్ నేతలు



**కావలి రూరల్, జులై 16 ప్రభాతవార్త** నెల్లూరు నగరం లోని ఇరుగాలమ్మ గుడి వద్ద ఆదివారం జరిగిన కాపు భవన్ ప్రారంభోత్సవానికి కావలి డివిజన్ బలిజ ఎం ప్లాయిస్ అభ్యుదయ సేవా సమితి(బీస్) అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. నెల్లూరులో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాల శేషగిరిని తోట వెంకటేశ్వర్లు కలిసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శా లు వాతో ఘనంగా సత్కరించారు.కావలి డివిజన్‌లో బీస్ అనుసరిస్తున్న విధివిధానాలు, ఇటీవల కాలంలో చేసిన సేవాకార్యక్రమాలు గురించి చర్చించుకోవడం జరిగింది.

## 32వ వార్డులో జనం కోసం జనసేన



**కావలి రూరల్, జులై 16 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలోని 32వ వార్డులో కావలి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సు ధాకర్, పట్టణ అధ్యక్షులు సాయివిఠ ల్‌ల సూచనల మేరకు జనం కోసం జనసేన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. 32వ వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బెల్లంకొండ మ స్తాన్‌బాబు ఆధ్వర్యంలో ఆ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు,పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ పాల్గొన్నారు. అధికార పార్టీ చేసే అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, కావలిలో జరగని అభివృద్ధి కావలి ప్రజలకు చేరే విధంగా పవన్‌కళ్యాణ్ రావాలి, పాలన మారాలని నినాదాలు చేశారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిఠల్, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలా శ్రీనాధ్, ఉపాధ్యక్షులు గాదె నాగార్జున, తోట శరణ్, రామకృష్ణ, లక్ష్మణ్, ప్రవీణ్, మురళి,నాని, సాయి, పలువురు యువత పాల్గొన్నారు.

## సంయుక్త సంరక్షణలో వున్న చిన్నారి మైష జన్మదిన వేడుకలు



**కావలి, జులై 16 ప్రభాతవార్త** కావలి సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో వున్న చిన్నారి మైషాకు కావలి శ్రీధర్ హాస్పిటల్ వైద్యశాల ప్రాంగణంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జన్మదిన కేక్‌ను కట్ చేయించారు. విద్యార్థులకు విద్యాఉపకర ణాలు, నగదును అందజేశారు. ఈ చిన్నారి బాధ్యతను స్వీకరించిన కావలి క్రిస్టియ న్‌పేటలో వున్న శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ కె.ఝాన్సీ దంపతుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్బంగా డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడారు. తన కుటుంబం నుంచి సంరక్షిస్తున్న చిన్నారి మైషా పుట్టిన రోజును తన వైద్యశాలలో జరుపు కోవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ చిన్నారి ఎంతవరకు చదువుకోవాలంటే అంత వరకు చది విస్తానని ఆయన తెలిపారు. పి.శ్రీజనిత్, డాక్టర్ పి.శివప్రసాద్, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, గౌరవ సభ్యులు యం.వి.యన్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## చల్లా యానాదులకు మన్నూరు వివాహ విందు



**రాపూరు, జులై16ప్రభాతవార్త** రాపూ రులోని సాయిగిరిజన కాలనీలో వున్న చల్లా యానాదులకు మాజీ సిని యర్ జర్నలిస్టు మన్నూరు గౌస్‌మొహిద్దీన్ ఆదివారం వివాహ విందును ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేది, జూలై 2వ తేది ఆయనకుమార్తెలు కరీ ష్మా, డాక్టర్ సీమాల వివాహం నెల్లూ రులో నిర్వహించారు. ఈ వివాహాల సందర్భన్ని పురస్కరించుకోని ఆయన ఈ విందును చల్లా యానాదులకు ఏర్పాటు చేశారు. సుమారు 120 మంది కాలనీలోని వారికి విందు ఏర్పాటు చేసి వారిత సహపంక్తి బోజనంలో ఆయన పాల్గొన్నారు.

## నేడు దేవమ్మచెరువులో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రాక

**సీతారామపురం జులై 16 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలో వైఎస్ఆర్‌సిపి ఉదయగిరి నియోజకర్గం ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిఆధ్వర్యంలో సోమవారం దేవమ్మచెరువు గడగడపకు కార్యక్రమం జరుగుతుంది. అదే విధంగా మంగళవారం సీతారామపురం బిట్-2,గడగడపకు కార్యక్రమం జరుగుతుంది. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆదివారం విలేఖర్ల సమావేశంలో తెలిపారు.ఈకార్యక్రమానికి వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్ద తరలిరావాలని పిలుపునిచ్చారు.

## టిడిపి బూత్‌లెవల్ సమావేశం



సంగం జులై 16 ప్రభాతవార్త సంగం మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బూత్ లెవల్ మీటింగ్ నిర్వహిం చా రు.ఆత్మకూరు తెలుగుదేశం పా ర్టీ ఇన్‌చార్జి ఆనం రామ నారాయణరెడ్డి ఆదేశానుసారం ఈ సమావేశం నిర్వహించినట్లు టిడిపినాయకులు తెలిపారు.ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులుయాద్ వ్,కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి, జిల్లా యువత ప్రధానకార్యదర్శి జడపల్లి దయాకర్‌గౌడ్, తెలుగుదేశం పార్టీ మండల ప్రధానకార్యదర్శి బాబు మాజీ సర్పంచ్ కోటు వెంకట కరుణాకార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మెట్టు విజయకృష్ణారెడ్డి,ఆత్మకూరు మహిళా అధ్యక్షురాలు కూరపాటి మంజుల, ఐటిడిపి మండల కన్వీనర్ గువ్వాడి చంద్రశేఖర్, సీనియర్‌నాయకులు కాకు వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.రానున్న ఎన్నికలలో పార్టీని ఏవిధంగా ముందుకు తీసుకొని వెళ్లాలన్న అంశంపై పూర్తి స్థాయిలో చర్చించారు.ఈకార్యక్రమంలో బాపన రఘురామయ్య,ఉక్కాల శ్రీనివాసులు,గడ్డం హజరత్‌రెడ్డి,మారెళ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,ఆనం శ్రీను, మర్రిపాడు మధు, నెల్లూరు రమేష్, కోలగట్ల వెంకటేశ్వర్లు, అల్లూరు శ్రీదర్‌రెడ్డి, ఒప్పోరి వెంకటేశ్వర్లు,ఫయాజ్,ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశ్రమంలో సర్వమత ప్రార్ధనలు




**ఇందుకూరుపేట, జూలై 16, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం పల్లిపాడు పినాకిని గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఆదివారం కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్ధన జరిగాయి. ఈ కార్యక్ర మంలో ముందుగా కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కోర్ కమిటీ సభ్యులు గణేశం, దయాకర్‌రెడ్డి మహా త్మగాంధీ విగ్రహానికి, పొనక, కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రము, నూలుమాల సమర్పించారు. అనంతరం కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మగాంధీ యొక్క సిద్ధాంతాల గురించి, వారి ఆశయాల గురించి పిల్లలకు వివరించారు. డాక్టర్ మస్తాన్ వలి, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేడూరు సహకార సంస్థ నూతన అధ్యక్షునిగా ఉదయ్‌కుమార్‌రెడ్డి



**తోటపల్లిగూడూరు, జూలై 16, ప్రభాత వార్త** తోటపల్లిగూడూరు మండలం పేడూరు సహకార బ్యాంకు నూతన చైర్మన్‌గా ఈ గ్రామానికి చెందిన తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి నియమితుల య్యారు. ఇక్కడ చైర్‌పర్స న్‌గా బాధ్య తలు నిర్వహించిన తిక్కవరపు సనత్ కుమార్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఖాళీని రాష్ట్ర వ్యవ సాయ సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిఫార్సు మేరకు ఉదయ్‌కుమార్‌రెడ్డిని నియమిం చారు. ఈ పదవి లభించడంలో కృషి చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు సొసైటీ సిబ్బంది, స్థానిక నేతలు ఉన్నారు.

## పేడూరు దేవాలయాల కార్యనిర్వహణాధికారిని తప్పించండి

**తోటపల్లి గూడూరు, జూలై 16, ప్రభాతవార్త** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ పలు ఫిర్యాదులు ఎదుర్కొంటున్న తోటపల్లి గూడూరు మండలం పేడూరు శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం శ్రీ అమృతేశ్వర స్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి ఎస్.నవీన్ నుతక్షణం సర్వేపల్లి నియోజకవర్గ పరిధి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర దేవాదాయ కమీషనర్ విజయవాడను ఆదేశించారు. ఈ ఆలయాల పట్ల తగిన శ్రద్ద చూపకపోవడంతో గ్రామస్తులు మంత్రి కాకాణి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన ఈవోను తక్షణం తమ ప్రాంతం నుంచి మరొక చోటకు పంపాలని కమీషనర్‌ను ఆదేశించినట్లు తెలుస్తుంది.

## కాపు భవన్ ప్రారంభంలో జనసేన నినాధాలతో దద్దరిల్లిన ప్రాంగణం



**నెల్లూరు, జులై16 ప్రభాతవార్త– విద్య** నగరంలోని స్థానిక ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీ పంలో నిర్ మించిన కాపు భవన్ ప్రారంబోత్సవంలో జనసేన నినా ధాలతో భవనప్రాంగణం దద్దరి ల్లింది. సభాస్థలిపై మంత్రులు, వైకాపా నాయకులు మాత్రమే ఉన్న సమయంలో జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషో ర్ పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని తన తలపై పెట్టుకుని నూతన భవనంలోని రావటంతో అక్కడే ఉన్న జనసేన నాయుకులు, కాపు యువత, కాపు సంఘ నాయకులు జై జనసేన, జై పవన్‌కళ్యాణ్ అంటూ పెద్దపెద్దగా నినాదాలు చేస్తూ హల్‌చల్ చేశారు. ఓ దశలో వీరిని పోలీసులు కూడా అడ్డుకోలేక పోయారు. ఈ సందర్బంగా గునుకుల మాట్లాడుతు కాపుభవన్ ప్రారంబోత్సవంలో కాపు నాయకులు చిత్రపటాలు కనపకడపోవటం హేయమన్నారు.కాపులకు ఈ ప్రారంబోత్సవంలో సరైన గుర్తింపు ఇవ్వలేని ఇది కేవలం వైకాపా పార్టీ సమావేశంలా ఉందని దుయ్యబట్టారు. సుమారు కొటిరూపాయలను విరాళంగా ఇచ్చిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ, ఇరత కాపు కుల పెద్దల పేర్లను శిలాపలకంలో వేయటపోవటం సరైన పద్దతి కాదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో నాలుగు సంవత్సరాలనుండి మూలన పడేసిన కాపు భవనం ప్రారంభాన్ని చేసి ప్రజలు విసర్జ ంచిన రాజకీయ ముసలివారిని వెనుక వేసుకుని వైకాపా నాయకులు కాపులంతా తమతోనే ఉన్నారని అనుకోవటం హాస్యాస్పదమన్నారు. జనసేన లో ఉంటూ స్టేజిమేదీ కూర్చుని ముఖ్యమంత్రికి జై కొట్టిన మాదాసు గంగాదరం అంతర్మదనం చేసుకోవాలని హితవు పలికారు. సీటు ఎవరికి ఇచ్చినా కాపులంతా ఒకే తాటిపై ఉన్నారనేదందుకు తమ రాకే ప్రత్యక్షనిదర్శనమన్నారు. రాష్ట్రమంత్రి అంబంటి కాపు కులాలను దూషించటం సిగ్గచేటని వాపోయారు. ఎన్నో అవమానాలు, ఎన్నో ఓడి దుడు కులు ఎదుర్కొని రాజకీయాలు చేస్తున్న తమ అధినేత పవన్‌కళ్యాణ్ కి అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో వైకాపాకుల డిపాజిట్స్ దక్కవన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పొదలకూరులో ఉచిత వైద్యశిబిరం



**పొదలకూరు జులై 16 ప్రభాతవార్త** పొదల కూరు పట్టణంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో యుటిఎఫ్ భవ నం నందు ఆదివారం అంబటి హేమల తారెడ్డి న్యూరో వైద్యునిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఉదయం 9 గంటల నుండి వైద్యశిబిరానికి పరీక్షల నిమిత్తం రోగులు అధిక సంఖ్యలో హాజ రైయ్యారు.స్థానికి ఆర్యవైశ్య నాయకులు పొట్టి సుధాకర్ ఉచిత వైద్యశిబిరానికి వచ్చి న రోగులకు సహాయక సహాకారాలు అం దించారు.డాక్టర్ హేమలతారెడ్డి ముఖ్యంగా పక్షవాతం,వెన్నుపూస సమస్యలు,తలనొప్పి ,మెడనొప్పి,నడుమునొప్పి నరాలకు సంబందించిన వివిధ సమస్యలపై రోగులను పరిక్షించారు.ప్రముఖ నూరోఫిజిషయన్‌గా పేరుపొందిని డాక్టర్ హేమలతారెడ్డి రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.వైద్యపరీక్షలలో వ్యాధులను గుర్తించిన రోగులకు అతి తక్కువ ఖర్చుతో ఖరీదైన వైద్యం అందిస్తామని సమాజసేవాదృక్పదంతో ఈ వైద్యసేలను జిల్లా అంతటా ఇస్తరిస్తున్నామని వివిధరకాల మెదుడు,వెనుముక,నారాల వ్యాధులతో బాధపడే రోగులకు నెల్లూరులోని మంచి వైద్యం అందిస్తామని ఆమె పేర్కున్నారు.ఈకార్యక్రమంలో సామాజిక వైద్యకేంద్రం సిబ్బంది,డాక్టర్ హేమలతారెడ్డికి సహాయసహకారాలు అందించారు.నెల్లూరులోని ప్రముఖ వైద్యులుగా పేరుపొందిన డాక్టర్ అంబటి హేమలతారెడ్డి సేవలు ఎంతో అభినందనీయమని పొదలకూరు ఆర్యవైశ్యనాయకులు అమర్తలూరు చెంచయ్య ప్రశంసించారు.

## వేమిరెడ్డి సోదరులకు మాతృవియోగం



**కొడవలూరు జులై 16 ప్రభాతవార్త:** నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజ ర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, సోద రుడు తెలుగుదేశం రాష్ట్ర నాయ కులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాతృమూర్తి వేమి రెడ్డి వజ్రావతమ్మ వయసు 79 సంవత్సరాలు, వ యోభారంతో ఆదివారం నందు కన్నుమూశారు, వారి అంతక్రియలు కొడవలూరు మండలం, గండ వరంగ్రామంలో వారి నివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొలి ట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ జిల్లా నా యకు లు, బాజాపా నాయకులు, సి.పి.యం నాయకులు, వివిధ పార్టీ నాయకులు, నెల్లూరు డీసీఎమ్మెస్ చైర్మ న్ వీరిచలపతిరావు, విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రం గారెడ్డి తదితర నాయకులు అమె పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఏసీబీ సోదాలకు గోశాలకు ఎలాంటి సంబంధం లేదు



**తోటపల్లిగూడూరు, జూలై 16, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని శ్రీ తల్పగిరి రంగనాధస్వామి ఆలయంలో అవినీతి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు రావడంపై శ్రీరంగనాధ గోశాల నిర్వాహకులు తమ గోశాలకు దేవస్థానం నుంచి ఎలాంటి నిధులు గాని, సహాయ సహకారాలు గాని అందలేదని పాంచ జన్యం వివరించారు. మొత్తం మీద ఈ గోశాల నిర్వహణలో నిర్వాహకులు సేవాభావంతో పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది. తోటపల్లి గూడూరు మండలంలోని విలుకానిపల్లి గ్రామంలో నెల్లూరు శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములు ఉన్నాయి. వీటిని సంబంధిత దేవస్థానం ఈవో ద్వారా వేలం పాటలు నిర్వహించి లీజులు వసూళ్లు చేస్తుంటారు. పాంచ జన్యం 2013 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు శ్రీ రంగనాథ గోశాల పేరుతో 150 గోవులను సేవా కార్యక్రమాల ద్వారా సంరక్షిస్తూ హిందువులకు అత్యంత ఆరాధ్యదైవమైన గోమాతను కసాయి పాలు కాకుండా సంరక్షించాలన్న తలంపుతో నియమ నిబంధనలను పాటిస్తూ, గోశాలను విస్తృత పరిచారు. ఈ గోశాల ద్వారా నిత్యం 15మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. రంగస్వామి గుడిలో జరుగుతున్న ఏసీబీ సోదాలకు గోశాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.

## జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నిరాధార ఆరోపణలు మానుకోవాలి



**ఆత్మకూరు, జులై16ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో పనిచేస్తున్న గ్రామస్థాయి వాలంటీర్ వ్యవస్థ ను చూసి భయపడుతున్న పవన్‌కళ్యాణ్, పచ్చపార్టీలు వాలంటీర్ల ద్వారా ఉ మెన్ ట్రాకింగ్ జరుగుతుందని నిరాధార ఆరోపణలు చేస్తు, ఇప్పుడు డేటా చోరీకి గురవుతుందని చెప్పడం వెనుక క్షేత్ర స్థాయిలోని ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవడం కోసం వైసిపి సమ ర్థవంతంగా పనిచేయడమేనని, ఓటమి భయం పట్టుకున్న పవన్ కళ్యాణ్ తన రాజకీయ యజమాని చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివి వినిపిస్తునా న్నదని వైసిపి జిల్లా ఐటి వింగ్ అధ్యక్షుడు కొప్పోలు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన డేటా చోరీ గురించి వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2019లో డేటాబేస్‌నుండి ఆధార్ ఇతర డేటా దొంగిలించడం జరిగిందని తెలిసినప్పటికీ టిడిపి ప్రభుత్ వం ఎందుకు స్పందించలేదన్నారు. పవన్‌కళ్యాణ్ చెప్పినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థ ద్వారా 30వేల మంది ఆడపడుచులు తప్పిపోయిన విషయం నిజమే అయితే ఒక్క పోలీస్‌స్టేషన్‌లో కూడా అటువంటి రికార్డు ఎందుకు నమోదు కాలేదన్నారు. పవన్‌కళ్యాణ్ తన ఆరోపణలపై ఆధారాలుంటే బయటపెట్టాలి లేకపోతే ముఖ్యమంత్రికి , వ్యవస్థకు బహిరింగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమెన్ ట్రాకింగ్ గురించి కేంద్ర ప్రనభుత్వం నిఘావర్గాలు తనకు తెలియజేశాయని చెపుతున్న పవన్‌కళ్యాణ్ కు కేంద్ర నిఘావర్గాలు ఎందుకు సమాచారం ఇస్తాయి. పవన్‌కళ్యాణ్ ఒక ఎంపి కాదు, ఒక ముఖ్యమంత్రి కాదు , ఒక ప్రధాని కాదు . ఎటువంటి బాధ్యతాయుతమైన పదవిలో కూడా లేని పవన్‌కళ్యాణ్‌కు కేంద్ర నిఘావర్గాలు హెచ్చరించాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్ చేస్తున్న వాఖ్యలపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లోనైనా పవన్‌కళ్యాణ్‌వాస్తవ పరిస్థిఉలను అవగాహన చేసుకొన కుండా కేవలం చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివి వినిఇపస్తే చంద్రబాబు నాయుడు నుండి పవన్‌కళ్యాణ్‌కు ప్యాకేజీ అందుతుందేమో కానీ ప్రజలనుండి మాత్రం పవన్‌కళ్యాణ్‌కు ఎటువంటి రాజీకయ మద్ధతు ఉండదని , రాబోయే రోజుల్లో కూడా పవన్‌కళ్యాణ్ ఎక్కడా గెలవడకుండా రాజకీయ అధోగతి పాలవుతాడని హెచ్చరించారు.

## చేజర్ల-సంగం మార్గంలో బస్సు

**చేజర్ల, జులై16ప్రభాతవార్త:** చేజర్ల–సంగం మార్గంలో ఎట్టకేలకు అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఆత్మకూరు డిపో నుంచి నూతనంగా ఈమార్గంలో బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ డిపో మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈమార్గంలో 5బస్సులు నడిచేవి. కాల క్రమేణా బస్సులన్నీ ఆగిపోయాయి. ప్రస్తుతం ఆటోలు కూడా ఈమార్గంలో నడవడం లేదు. చేజర్ల – సంగం మార్గంలోనే ఇద్దరు మాజీ ఎమ్మెల్యే, ఒక మాజీ ఎమ్మెల్సీ స్వగ్రామం ఉన్నా బస్సు సౌకర్యం లేదని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు ఆత్మకూరు డిపో వారు ఈమార్గంలో బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. బస్సు ఏర్పాటైనట్లు ప్రజలందరికీ తెలిసే లోగా కలెక్షన్ లేదన్న సాకుతో వాటిని ఎత్తేయడం ఆర్టీసి అధికారులకు పరిపాటైంది. ఆత్మకూరు నుంచి చేజర్ల మీదుగా పెంచలకోనకు ఓ బస్సును ఏర్పాటు చేశారు. బస్సు సౌకర్యం ఉందన్న విషయాన్ని జనాలు తెలుసుకునే లోగా దాన్ని ఎత్తేశారు. అలాగే ఆత్మకూరు–చేజర్ల మార్గంలోనే బెంగుళూరుకు ఓ బస్సును ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ బస్సును తిప్పడంతో చాలా మంది అంతదూరం ప్రయాణించడానికి మొగ్గు చూపలేదు. తర్వాత హైటెక్‌బస్సును ఏర్పాటు చేశారు. అయితే చేజర్ల నుండి కోటితీర్థం మీదుగా బస్సును ఏర్పాటు చేయడంతో అక్కడి నుండి ఆ బస్సు ఎక్కేవారే కరువయ్యారు. అదే బసుసను ఆదూరుపల్లి, కలువాయిల మీదుగా నడిపి ఉంటే మంచి కలెక్షన్‌లు వచ్చేవని ఈ ప్రాంత ప్రయాణీకులు చెప్పుకుంటున్నారు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన ఈ సర్వీసును ఎన్ని రోజులు ఉంచుతారో ఏమో అంటూ జనాల్లో చర్చ మొదలైంది . ఆత్మకూరు డిపోకు చెందిన ఈ బస్సు ఉదయం 6గంటలకు ఆత్మకూరులో బయలుదేరి 6.45గంటలకు చేజర్లకు, అక్కడి నుండి 7గంటలకు బయలుదేరి 7.45కి సంగంకు , అక్కడినుంచి 8.15కు బయలుదేరి 9గంటలకు చేజర్లకు, అక్కడి నుండి 9.15కు బయలుదేరి 11గంటలకు నెల్లూరు, అక్కడి నుండి 11.30కి బయలుదేరి 1.15కు చేజర్లకు , అక్కడి నుండి 1.45కు బయలుదేరి 2.30కి సంగంకు , అక్కడి నుండి 2.45కు బయలుదేరి 3.45కు చేజర్లకు, అక్కడి నుండి 4గంటలకు బయలుదేరి 5.45కు నెల్లూరుకు , అక్కడి నుండి 6.15కు బయలుదేరి రాత్రి 8గంటలకు చేజర్ల, అక్కడ 8.05కు బయలుదేరి 8.45కు ఆత్మకూరుకు చేరుకునేలా బస్సు సమయాలను రూపొందించారు. ఈమార్గంలో బస్సును ఏర్పాటు చేశారని జనాలకు తెలిసేలోగా కొంత కాలం పడుతుంది. అప్పటి వరకు అధికారులు ఈ సర్వీసును ఎత్తివేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎమ్మెల్యే ప్రసన్న దిష్టిబొమ్మ దగ్ధం



**కోవూరు జులై16 ప్రభాతవార్త** జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గనుకుల కిషోర్ ఆధ్వ ర్యంలో ఆదివారం కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమా ర్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతు అభివృద్ధి చేయటం చేతకాక తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలుచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కోవూరుకు తలమానికంగా ఉన్న షుగర్ ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల షేర్‌హోల్డర్స్‌గా ఉన్న కంపెనీని వారి ప్రమేయం లేకుండా అన్యాక్రాంతం చేసేందుకు కుట జరుగుతుందని, దీనిని ఎట్టి పరిస్థితులో అడ్డుకుంటామన్నారు. షుగర్ ఫ్యాక్టరీలో రైతులు 48శాతం వాటాను కలిగి ఉన్నా నేటికీ వారి బాధలు తీరలేదని, వెంటనే వారి బకాయిలు చెల్లించాలన్నారు. స్థానికంగా ఎమ్మెల్యేగా గత అనేక సంవత్సరాలుగా ఉన్నా ఈ ప్రాంతంలో అభివృద్ధి మాత్రం జరుగలేదని ఏద్దేవా చేశారు. అలాగే కోవూరు నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మాఫియా చేస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, రానున్న ఎన్నికల్లో వైకాపా కు ప్రజలు తగిన గునపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. పార్టీకి అనుకూలంగా లేకపోతే వాలంటీర్లతో వారిని బెదిరించి బయభ్రాంతులకు గురిచేయటం సరైన పద్దతి కాదాన్నరు. తమ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పట్టించుకోకుండా తమ అదినేతపై అవాక్కులు చెవాక్కులు పేలితే ఊరుకోబోమని హెచ్చరించారు పార్టీ ఉపాధ్యక్షులు బద్దపూడి సుధీర్, కార్యదర్శి ప్రశాం త్‌గౌడ్, చిన్నరాజా, ప్రసన్న, కేశవ,షారు, సాయి, పార్దు,, వర్షన్, తేజ, వెంకీ,మౌనేష్, వర్ణన్ పాల్గొన్నారు.

## అలరించిన సంగీత నృత్యోత్సవం



**నెల్లూరు టౌన్, జులై 16 ప్రభాతవార్త** మందులతో తగ్గని అనేక రోగాలు సంగీతంతో నయం చేయవచ్చునని శ్రీరామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు పేర్కొన్నారు. గ్రీన్‌ఫోర్స్ ట్రస్ట్ కృష్ణ కల్చరల్ అండ్ ఈవెంట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం సంగీత నృత్య పోటీలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చాలా చక్కగా ప్రదర్శనలు చేశారని ప్రశంసించారు. తల్లిదండ్రులు చదువుతో పాటు ఆటపాటలలో పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, నిర్వాహకులు బి.కృష్ణ, జడ్డి అనురాధ, జి.వి నాగరాజు, ఎల్.యం షోరూమ్ అధినేత బి.మురళీకృష్ణ, పేరూరి ప్రదీప్, కళాకారులు, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన మోటారుసైకిల్



**కోవూరు జులై16 ప్రభాతవార్త** కూలీ నాలీ పనులుచేసుకుంటూ జీవనం సా గించే రెండుకుటుంబాల్లో ఆదివారం జరి గిన రోడ్డు ప్రమాదం భరించలేని విషా దాన్ని నింపింది.కోవూరు ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు సమాచారం మేరకు గండవరం గ్రామానికి చెందిన జుబేర్ జా విద్‌లు రాజుపాలంలోని ఓ వెల్డింగ్ షా ప్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. యధావిధిగా ఆదివారం కూడా షాపుకు వచ్చారు. ఈ నేపద్యంలో మెటార్‌సైకిల్ ఇరువురు ఆదివారం నెల్లూరు నుండి వెల్డింగ్ షాపుకు సంభందించిన రేకును తసీఉకుని వస్తుండగా రామన్నపాలెం గేట్ సమీపంలో మైటార్‌సైకిల్ అదుపుతప్పింది. ఈ సంఘటనలో జుబేర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, జివిద్ కి కూడా తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో బాదితునిడి నెల్లూరులో ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆయన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసునట్లు ఎస్ఐ తెలిపారు.

## వేమిరెడ్డికి మాతృవియోగం

## -పరామర్శించిన దోడ్డంరెడ్డి



**కోవూరు జులై16 ప్రభాతవార్త** మాజీ ఏఎంసీ చైర్మన్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిల మాతృమూర్తి వేమిరెడ్డి వనజమ్మ ఆది వారం మృతిచెందారు. ఆమె పార్ధీవదేహాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి సందర్శించి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా వేమిరెడ్డి సోదరులకు ఆయన పరామర్శించి సానుభూతి తెలియజేశారు. మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

# వైద్య రంగంలో రేడియాలజిస్టుల పాత్ర చాలా కీలకమైంది

తిరుపతి టౌన్, జులై 16, ప్రభాతవార్త

స్విమ్స్ రేడియాలజీ విభాగం, ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియా గ్రాఫర్స్, టెక్నాలజిస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం, వర్కర్ షాపును నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ హాస్పటల్‌లో ఆదివారం రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ రేడియోలజీ అనే అంశం పై సిఎం ఈ కార్యక్రమాన్ని టిటిడి విద్యా వైద్య విభాగం జేఈవో, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదాభార్గవి, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, ఎస్ఆర్ఎంసి డాక్టర్ పన్నీర్ సెల్వం, డాక్టర్ డానియల్ జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించనట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేసారు. టిటిడి విద్యా వైద్య విభాగం జేఈఓ స్విమ్స్ డైరెక్టర్ ఉపకులపతి సదాభార్గవి మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణలో రేడియాలజీ విభాగం పాత్ర కీలకమైందని సాంకేతిక రంగంలో విప్లవాత్మమైన మార్పులు చోట చేసుకున్న తరుణంలో రేడియాలజిస్టులు రేడియాలజీ రంగంలో ఆధునిక పోకడలను అందిపుచ్చుకుని క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కాలానుగుణంగా వ్యాధి నిర్ధారణ చికిత్స



పద్ధతులలో ఇంటర్నేషనల్ రేడియాలజీ ప్రక్రియలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులో ఇలాంటి వర్క్ షాపులు మరిన్ని నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేసారు. ఇందుకు కావల్సిన సహాయ సహకారాలు టిటిడి అందిస్తుందని తెలియజేసారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ రేడియాలజీ క్లుప్తంగా అనేది రేడియాలజీలోని ఒక ప్రత్యేక విభాగం ఈ భాగంగా అల్ట్రాసౌండ్, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఫ్లురోస్కోపి, డిఎస్ఎ తదితర పరికరాలను ఉపయోగించి వ్యాధి నిర్ధారణ చికిత్సలు చేయబడుతాయి. ఆపరేషన్‌తో పోలిస్తే ఈ పద్ధతిలో చికిత్స చేయడం వలన చిన్న కోత రంధ్రము అవసరం అవుతుందన్నారు. అతి తక్కువ సమయంలో ఫేషంట్ కోలుకోవడం జరుగుతుంది. హాస్పిటల్‌లో ఉండాల్సిన సమయం కూడా తక్కువ విధానం వలన ఇన్ఫెక్షన్, బ్లీడింగ్ తదితర కాంప్లికేషన్స్ కూడా తక్కువగా సంభవిస్తాయి. రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు రక్తనాళాల వ్యాపు క్యానర్స్‌కు సంబంధించిన గడ్డలను నయం చేయుటకు అలా అలాగే ఇన్ఫెక్షన్స్ వలన కలిగే చీమగడ్డలను నయం చేయుటకు వీలవుతుందని తెలియజేసారు. గత 10 సంవత్సరాలలో రేడియాలజీ టెక్నాలజీలో వచ్చిన వినూతమైన మార్పుల వలన ఇంటర్నేషనల్ రేడియాలజీ ద్వారా వివిధ రకాలైన వ్యాధులకు చికిత్స చేయడానికి వీలవుతుందని తెలియజేసారు. అనంతరం చెన్నై నగరానికి చెందిన డాక్టర్ పన్నీరు సెల్వం, డాక్టర్ డానియల్‌ను స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదా భార్గని జ్ఞాపికను అందజేసి దృశ్యాలతో సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదాభార్గవికి రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగపు వైద్యులు, రేడియాలజిస్టులు, టెక్నీషియన్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి..పవన్‌కళ్యాణ్!

-జనసేన నాయకుడు గుట్టా నాగరాజు రాయల్

-తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 16 ప్రభాతవార్త:



రాబోవు 2024 ఎన్నికల్లో జనసేన అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని,అలాగే తిరుపతి ఎమ్మెల్యేగా డా॥పసుపులేటి హరిప్రసాద్ గెలవడం తథ్యమని జనసేన నాయకుడు గుట్టా నాగరాజు రాయల్ స్పష్టం చేశారు.ఆయన తాజాగా జనసేన పార్టీలో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షుడు అయిన డా॥హరిప్రసాద్‌ను ఆదివారం ఆయన కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం,దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ తాను జనసేన పార్టీలో చేరినప్పుడు జిల్లా అధ్యక్షుడు స్థానికంగా అందుబాటులో లేని కారణంగా నేడు కలిసి పార్టీ బలోపేతం గురించి చర్చించడం జరిగిందన్నారు.త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి,ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.అనంతరం డా॥హరిప్రసాద్ నాగరాజు రాయల్‌ను దుశ్శాలువతో సత్కరించి పార్టీలో చేరినందుకు అభినందనలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయుడు శ్రీహరి,దండు ప్రభాకర్,వెంకటేష్,రమణ,గోగినేని రమేష్,గురుస్వామి, డా॥బాబు, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు భారతీయస్టేట్ బ్యాంక్‌లో సిబ్బంది కొరత

-గంటల తరబడి వినియోగదారుల పడిగాపులు

సత్యవేడు, జూలై 16 ప్రభాతవార్త:



భారతీయస్టేట్ బ్యాంక్ సత్యవేడు శాఖలో ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొని ఉంది. ఉదయం సిబ్బంది రాక ముందే బ్యాంక్‌కు చేరుకుని, క్యూలైన్‌లలో నిలబడుతున్న డ్వాక్రా మహిళలు గంటల తరబడి వేచిఉండి మరీ బ్యాంక్ సేవలను పొందాల్సి వస్తుంది. ప్రధానంగా ఇక్కడ బ్యాంక్‌లో మండలంలోని అన్ని పొదుపు సంఘాలు లోన్, సేవింగ్ ఖాతాలను కలిగి ఉన్నాయి. ప్రతినెలా పొదుపు సంఘాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఈబ్యాంక్‌లో జరుగుతుంటాయి. అయితే సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులు, డాక్రా మహిళలు బ్యాంక్ సేవలు పొందాలంటే నాలుగైదు గంటలు వేచిఉండక తప్పడం లేదు. గతకొంత కాలంగా సత్యవేడు భారతీయస్టేట్ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్ కుర్చీ ఖాళీగా దర్శనమిస్తున్నది. సెలవు పెట్టారా లేక బదిలీ అయ్యారో తెలియని పరిస్థితి ఉంది. పొదుపు సంఘాలకు మంజూరు కావాల్సిన కొత్త ఋణాలు, ఖాతాదారులు ధరఖాస్తు చేసుకున్న వ్యక్తిగత ఋణాలకు సంబంధించిన సేవలు గతకొన్ని రోజులుగా మూలనపడ్డాయి. కొంత కాలంగా ఏటిఎం, సిడిఎంఎ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఇక్కడ బ్రాంచ్ మేనేజర్ పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది కొరత, సేవలు అలసత్వం కనిపిస్తోందని, ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

## వాలంటీర్ల వ్యవస్థలో లోపాలను గాడిలో పెట్టండి

రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

తిరుపతి కలెక్టరేట్, జులై 16, ప్రభాతవార్త

వాలంటీర్ల వ్యవస్థలో లోపాలను గాడిలో పెట్టండని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులలో ఎవరైనా అవినీతికి పాల్పడినా అక్రమ సంపాదన కూడబెట్టినా, ప్రలోభాలకు లొంగినా కట్టడి చేసేందుకు ఏసీబీ, సిబిఐ, ఈడి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ లాంటి అనేక విభాగాలు దాడులు చేసి క్రిమినల్ కేసులు బుక్ చేసి చర్యలు తీసుకుంటారని మరి వాలంటీర్ వ్యవస్థలో ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్టం తీసుకురావాలన్నారు. ఆకులో అరటిపండులా ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు వాలంటీర్ల వ్యవస్థను ఓట్ల కోసం ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు వాడుకొనే ప్రమాదం ఉంది వాలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత తీసుకొస్తే వాలంటీర్ వ్యవస్థ బాధ్యతగా పని చేస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత పథకాలను పెన్షన్‌లను లబ్ధిదారులకు చేరవేసేందుకు వారధిగా పనిచేస్తున్న వాలంటీర్ల వ్యవస్థలోని లోపాలపై ప్రతిపక్షాలకు ప్రజలకు కలుగుతున్నటువంటి అనుమానాలను నివృత్తి చేసేందుకు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణకు ఆదేశించి వాలంటీర్ వ్యవస్థ విధి విధానాలపై శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలలో నమ్మకం కలిగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వాలంటీర్ వ్యవస్థ పరపతి పెంచే విధంగా నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజా స్వామ్య పద్ధతిలో సేవ చేసే ప్రజల అధికార ప్రతిపక్ష పార్టీల మన్ననలు పొందేలా పని చేయాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్న వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచి జీవిత ఆరోగ్య భీమా పథకం ద్వారా వారి కుటుంబానికి భరోసా కల్పించి ఉచిత వైద్య సదుపాయంతో పాటు ప్రమాదవశాత్తు ఎవరైనా వాలంటీర్ చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పించేలా కాబినెట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేసారు.

## ప్రమాదపుటంచున చిన్నారులు

- ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం



నాగలాపురం, జూలై 16 ప్రభాతవార్త:

మండలంలోని సురుటుపల్లి గ్రామములో మాజీ ఎమ్మెల్యే హేమలత గతకొన్నేళ్ళుగా జియోన్ పేరిట బాలికల ఆశ్రమంను నిర్వహిస్తున్నారు. ఆమె ఆంధ్రా, తమిళనాడు ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహణలో భాగంగా నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు ఉచిత విద్యను అందిస్తున్న విషయం విధితమే. అయితే ఇక్కడ నిర్వహిస్తున్న బాలికల వసతి గృహంలో నిర్వాహకుల పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగా చిన్నారులు పది అడుగుల గోడపై ప్రమాదకరంగా ఉన్నట్టుగా తెలుస్తుంది. పొరపాటున చిన్నారులు అక్కడ నుండి ప్రమాదవశాత్తు కిందకు పడితే ప్రాణాపాయం సంభవించే అవకాశాలు లేకపోలేదు. ఇకనైనా ఆశ్రమ నిర్వాహకులు చిన్నారుల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా అంకాళమ్మ జాతర

శ్రీకాళహస్తి,జూలై 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని పాత వరదయ్యపాళెం రోడ్డులో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న అంకాళమ్మ తల్లి జాతరను నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఇటు విఎంసి సర్కిల్ నుంచి అటు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు విద్యుత్ దీపాల కాంతులతో ముస్తాబు చేసారు. అమ్మవారి విద్యుత్ దీపాల విగ్రహాలను ఏర్పాటు చేసారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, పంబ జోళ్ళ మోతతో పరిసరాలు దద్దరిల్లాయి. జాతర సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు తమ ఇళ్ళ వద్ద అంబలి వితరణ చేసారు. ఇళ్ళ ముందు వేపాకుతో ముస్తాబు చేసారు.జాతర సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంతజూరు తారక శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు.వారికి ఆలయ కమిటి సభ్యులు మేళ తాళాలతో స్వాగతం పలికారు.ఆయనతో పాటు కోళ్ళూరు హరినాయుడు, పోలసామి స్వర్ణమూర్తి, ఫజల్, యతిరాజులు, బాలగౌడ్ ఉన్నారు. ఆలయ కమిటి సభ్యులు గోవర్ధన్, బాలాజి, మురళిలు జాతర నిర్వహణలో కీలకంగా వ్యవహారించి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇచ్చినందుకు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అభినందించారు.

## చండికాపీఠం వ్యవస్థాపకులకు సన్మానం

తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త



మండలంలోని నెల్లిమానుకండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన చండికాపరమేశ్వరి సమేత చక్రేశ్వర స్వామి మరియు ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేకాన్ని అంగరంగవైభవంగా నిర్వహించిన విషయం విదితమే. ఈనేపధ్యంలోచండికాంబికా పీఠం ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు బాలసుబ్రమణ్యంశాస్త్రి, సింగరాజు లక్ష్మి దంపతులను శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు దుశ్శాలువతో సత్కరించారు. గ్రామంలో అమ్మవారి శక్తిపీఠాన్ని నిర్మించడం ఎంతో అదృష్టమని తెలిపారు. వీరితోపాటు సింగరాజు పవన్‌కుమార్, ధరంసుమన్‌కుమార్‌శర్మ, పూనివెంకటసుబ్రమణ్యమహేష్, చక్రాలవెంకటలక్ష్మి నరసింహం, శిరోభూషణం సునీల్‌శర్మ, తబ్జుల సుబ్బరామగుప్తా, గురజాల నాగరాజశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## మాటలు చెప్పటం మాయచేటం మాకు చేత కాదు

మాదిచేతల పాలన: బియ్యపు

శ్రీకాళహస్తిరూరల్,జూలై 16 ప్రభాతవార్త



మాటలు చెప్పటం మాయ చేయటం తమకు చేత కాదని నిరుపేదలకు సహాయం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గోవిందరావుపల్లి, ఆంజనేయపురం, మాధవగిరి గ్రామాలకు చెందిన79 మంది నిరుపేద కుటుంబాలకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయంలో పట్టాలు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలుచెప్పి జనాల్ని మాయ చేసి ఓట్లు సంపాదించి తరువాత ఐదేళ్ళ పాటు కనబడకుండా పోయే సంప్రదాయం తమది కాదని అన్నారు.2019 ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్ళినపుడు ఈ ప్రాంత ప్రజలు తాము 30 సంవత్సరాలుగా తెలుగుదేశం నాయకులకు మొరెబెట్టుకుంటున్నా పట్టించుకోలేదని మీరేం చేస్తారని వ్యంగ్యంగా మట్లాడారని అయితేతాను మాటలుచెప్పను మీకు సహాయం చేస్తామని సహాయం చేసిన తరువాతనేఓట్లు అడుగుతానని భరోసా ఇచ్చానన్నారు.మాట తప్పటం మడమ తిప్పటం ఏమార్చటం తమకు అలవాటు లేదన్నారు. పట్టాలు పొందిన నిరుపేదలో ఎంతో సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమాల్లో ఎంపి గురుమూర్తి, పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, గోవిందరావు పల్లి మాజీ సర్పంచ్ కోటి,సుబ్బరాయులు, చంద్రయ్య, గురవయ్య, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డి, వెంగయ్య, గోరా, కోల్లూరు హరినాయుడు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## యువనేస్తం సారధ్యంలో గిరిజన విద్యార్ధులకు వితరణ

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), జూలై 16ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలోని గిరిజన విద్యార్థులకు యువనేస్తం సహాయ సహకారాలు అందిస్తుంది. ఈ నేపధ్యంలో గిరిజన తాండాలలో చదువుకు వెళ్ళని చిన్నారులను విద్యపై మక్కువ కల్పించుటకు యువనేస్తం నడుంబిగించింది. అధ్యక్షులు మునిశేఖర్ సారధ్యంలో సాయంత్రం బడులు నిర్వహిస్తున్నారు. అక్షరాలపై మక్కువ కల్గిస్తున్నారు. ప్రోత్సహాకాలతో ఆకట్టుకుంటున్నారు. అక్షరాలు దిద్దిస్తున్నారు.ఈ నేపధ్యంలో గిరిజన కాలనీల్లో సాయంత్రం బడులు నిర్వహిస్తున్నారు. ఆదివారం చిందేపల్లి గిరిజన కాలనీలో ఒక జత బట్టలు, పుస్తకాలు, విద్యాసామగ్రిని అందించారు.వీటిని గ్రామ సర్పంచ్ పెంచులయ్య ద్వారా అందించారు.ఈ కార్యక్రమాల్లో యువకులు చెంచురెడ్డి, ఈశ్వరయ్య,కోఆర్డినేటర్లు అరుణ,నాగమణి, వాలంటీర్లు లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టిఎన్‌టియుసి అధికార ప్రతినిధిగా కొలకపూడి సుబ్రమణ్యం

తిరుపతి కలెక్టరేట్, జులై 16, ప్రభాతవార్త

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర టిఎన్‌టియుసి అధికార ప్రతినిధిగా కొలకపూడి సుబ్రమణ్యంని



ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఆముదాల తులసి రామ్‌ని, సెక్రెటరీగా దేవల్ల శ్రీనివాసులుని నియమించారు. ఈ సందర్భంగా తిరుపతి నియోజకవర్గ మన్నూరు సుగుణమ్మ నివాసం వద్ద ఆమెను కలిసి దుశాలువతో సత్కరించారు.

## శ్రీ పద్మావతి మహిళ విశ్వ విద్యాలయంతో బంగ్లాదేశ్‌లోని బిఐఐడి పౌండేషన్‌తో అవగాహన ఒప్పందం

తిరుపతి (క్రీడ), జులై 16, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం పోషకాహారం, మహిళా వ్యవస్థాపకతపై పని చేయడానికి బంగ్లాదేశ్‌లో బిఐఐడి ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బిడ్ పౌండేషన్ బంగ్లాదేశ్‌లో అంతర్జాతీయ సంస్థలతో కలిసి న్యూట్రిషన్, ఉమన్ ఎంటర్‌ప్రెన్షిప్ అభివృద్ధి కోసం పని చేస్తున్నటువంటి సంస్థ అని ప్రొఫెసర్ రజని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజనీతో పాటు ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి, డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, ప్రొ. ఆర్.ఉషా, డైరెక్టర్ ఆర్ అండ్ డి సెంటర్, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజ్ ఫౌండేషన్, బంగ్లాదేశ్ కంప్యూటర్ కౌన్సిల్ యొక్క ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోమహిళల కోసం ప్రత్యేకంగా ఇంక్యుబేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేసేందుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంని మెంటార్‌గా గుర్తించేందుకు ఎస్ఎంఈ పౌండేషన్, బిసిసి రెండూ ఆసక్తిని వ్యక్తం చేసాయన్నారు. గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను బృందంతో పంచుకున్నారు. బృందం డాఫోడిల్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీని కూడా సందర్శించింది. ద్వైపాక్షిక విద్యా సహకారం, అధ్యాపకుల మార్పిడిని ప్రోత్సహించడానికి రెండు సంస్థలు ఎంఓయూ కుదుర్చుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించాయని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాయలం, బిడ్ పౌండేషన్ యుఎన్ ఏపిసిఐసిటితో కలిసి ఆగష్టు నెలలో మహిళా పారిశ్రామికవేత్తల విద్యార్ధులు, ఎన్‌జిఓ

# తిరుపతి డివిజన్

## ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

తిరుపతి (విద్య), జూల్ 16, ప్రభాతవార్త




స్థానిక జీవకోనలోని విశ్వం హైస్కూల్ నందు ఆదివారం సప్తగిరి ఐ కేర్ సెంటర్, విశ్వం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రముఖ ఐ స్పెషలిస్ట్ ఆప్తలమిక్ సర్జన్ డాక్టర్ ఐ. తనుష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐ. తనుష సుమారు 150 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టాణాల్లో చాలా మంది ప్రజలు కంటి జబ్బులతో బాధపడుతున్నారు అని, కంటి పరిక్షలు చేయించుకునే వెసులుబాటు లేకపోవడం వల్లనో, నిర్లక్ష్యం వల్లనో, అవగాహన లేకపోవడం వల్లనో వారు చికిత్సకు దూరంగా ఉంటుందన్నారు. తమకు కంటి జబ్బు ఉన్నా గుర్తించకుండా నెట్టుక వస్తున్న వారున్నారు. వారందరికీ ముందు అవగాహన కల్పించడానికి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థ అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, ఎస్‌వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఐవీ రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న "లవకుశ" నాటక ప్రదర్శన

సుబ్బరాజు నాట్య కళా పరిషత్‌కు అభినందనలు

చంద్రగిరి, జూలై 16 ప్రభాతవార్త:



భక్తిరస నాటకం లవకుశ ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నది. స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఆదివారం తిరుపతికి చెందిన సుబ్బరాజు నాట్య కళాపరిషత్ కోనేటి సుబ్బరాజు నిర్మాణ దర్శకత్వంలో భక్తిరస నాటకం లవకుశ ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో కళాకారులు తమ తమ పాత్రలకు పరిపూర్ణ న్యాయం చేకూర్చుతూ చేసిన అభినయ ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది. టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయ ఔన్నత్యాన్ని ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకెళ్ళడంలో భాగంగా లవకుశ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సంతాన లేమితో దిగులు చెందుతున్న దంపతులు శ్రీసీతారాముల వారికి కళ్యాణం జరిపించడం ద్వారా పిల్లలు లేని చింతను విడండి అనే సందేశంతో ఈ నాటకం కళ్ళకుకట్టినట్లు ప్రదర్శించారు. కాగా శ్రీకోదండరామాలయంలో సోమవారం శ్రీసీతారాముల కళ్యాణం జరిపించనున్నట్లు ఆలయ అధికారులు వెళ్ళడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముదికుప్పం రూపరామమూర్తి దంపతులు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ జి.దేవేంద్రబాబు, ఏఈఓ కోనేటి సుబ్బరాజు, పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి, యం.జనార్ధన్ రాజు,గుండాల గోపినాధ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరామాపురంలో వైభవంగా మాతమ్మ తిరునాళ్ళు

అమ్మవారికి పులివర్తి సుధారెడ్డి సారె

రామచంద్రాపురం, జూలై 16 ప్రభాతవార్త:



వెంకటరామాపురంలోని ఏఏడబ్ల్యులో మాతమ్మ తిరునాళ్ళు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం టిడిపి మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ పూజారి ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామంలోని మహిళలతో కలిసి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆమె సారెను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, గిరి నాయుడు, గిరిధర్ రెడ్డి, నరశింహారెడ్డి, లీలామోహన్, రామిరెడ్డి, రంజిత్,పాల్గొన్నారు.

## 30న గోవిందరాజ ఆలయంలో

తులసి మహత్యం ఉత్సవం

తిరుపతి(క్రీడ),జులై 16ప్రభాతవార్త:

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 30న తులసి మహత్య ఉత్సవం జరగనుంది. స్వామివారికి తులసి దళం అత్యంత ప్రీతికరం. శ్రావణ శుద్ధ ద్వాదశిరోజు తులసి ఆవిర్భావం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని గోవిందరాజ స్వామి ఆలయంలో గరుఢవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాఢవీదుల్లో ఊరేగుతారు.

## నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పుత్తూరురూరల్, జూలై 16 ప్రభాతవార్త:



పుత్తూరు తాలూకా శ్రీకృష్ణ యాదవ ఉద్యోగుల సేవా సంఘంఆధ్వర్యంలోనూతనకమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా చల్లా మునికృష్ణయ్య, కార్యదర్శి బి.లక్ష్మిపతి, గౌరవ అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది బి.రవీంద్ర, కోశాధికారి సి.సోమశేఖర్, సహాధ్యక్షులుగా వి.వెంకటరమణయ్య, జి.జయచంద్ర, సంయుక్తకార్య దర్శి గాడి.ఎం.వెంకటేశులు, ఉపాధ్యక్షు లు నాగరాజు, భీమారావు,

## మాట తప్పడం మడమ తిప్పడం జగన్ నైజం

వడమాలపేట, జూలై 16 ప్రభాతవార్త:



మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైజమని చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న విమర్శించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూలై 8 రాజశేఖర్‌రెడ్డి జయంతి నుంచి అవ్వ తాతలకు మూడు వేల రూపాయలు పెంచుతామని, జూలై 15 నాటికి రాష్ట్రంలో రోడ్లపై గుంతలు ఉండవని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వాటిని విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయక మడమ తిప్పడం ముఖ్యమంత్రి అలవాటుగా మారిందన్నారు. వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారే కాని అభివృద్ధి కనిపించడం లేదన్నారు. జగన్ పాలనలోరాష్ట్రం మరో బీహార్‌గా మారడం తథ్యమని ఆమె విమర్శించారు.

## పార్టీలకతీతంగా కాపుల బలోపేతమే లక్ష్యం



జిడినెల్లూరు కాపు సంక్షేమసేన అధ్యక్షులు

కార్వేటినగరం,జులై 16 ప్రభాతవార్త:

పార్టీలకతీతంగా కాపుల బలోపేతమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జిడినెల్లూరు కాపు సంక్షేమసేన అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్‌రాయల్ తెలిపారు. కార్వేటిన^గరం శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో కాపు బలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించబ డింది.సమావేశానికి పార్టీలకతీతంగా ఆరుమండలాలకు సంబంధించినటువంటి వివిధ రంగాలలో ప్రముఖులు,వ్యాపార,రాజకీయ, సామాజికవేత్తలైన బలిజలు పాల్గొన్నారు. జిడినెల్లూరు నియోజక వర్గంలోని అన్నిమండలాలకు అధ్యక్షులను,నియోజకవర్గ అధ్యక్షులైన కొప్పేటిప్రసాద్‌రాయల్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులను సంఘటితం చేసి,కాపులయొక్క అభివృద్ధికి పాటుపడే విధంగా, కాపుల సమస్యలను పరిష్కరించే విధంగా,భవిష్యత్తు కాలంలో బలిజలు సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా,రాజకీయంగా బలోపేతం అయ్యే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిడినెల్లూరు నియోజకవర్గ నందు కాపుభవన నిర్మాణమునకు శ్రీకారం చుట్టారు. మొట్టమొదటి సారిగా కాపు,భవన నిర్మాణమునకు కొప్పేటిప్రసాద్‌రాయల్ లక్ష రూపాయిలు విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ రామశెట్టి రాజశేఖర్,కాపు సంక్షేమసేన రాష్ట్ర సెక్రటరి గోపిరాయల్, కాపుసంక్షేమసేన గౌరవఅధ్యక్షులు జిల్లెల లోకనాధనాయుడు,గాజుల నరసింహులు, సుభాష్ నాయుడు,నాగమునినాయుడు,రవి,నాగరాజు,వెంకటేశ్వర్లు,రమేష్,దేవరాజులు,తులసీరాయల్,జయశంకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అప్సర్ కుటుంబానికి యువత ఆర్థికసాయం

కార్వేటినగరం,జులై 16 ప్రభాతవార్త:



కార్వేటినగరం ముస్లింకాలనీకి చెందిన అప్సర్ కుటుంబానికి స్థానిక ఆర్‌కెయస్ఆర్ ప్రభుత్వహైస్కూల్ 2003బ్యాచ్ విద్యార్థులు 11వేల రూపాయిలు ఆర్థికసాయాన్ని అందించారు. అప్సర్ అనే యువకుడు ఇటీవల స్కూటర్ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన సంఘటన పాఠకులకు విధితమే. మెరుగైన చికిత్స కోసం చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతను త్వరలో కోలుకోవాలని యువత కోరుతున్నారు. కార్యక్రమంలో ఆర్‌కెయస్ఆర్ పూర్వపు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ట్రాన్స్‌కో కోవూరు డివిజన్ ఏర్పాటు

### ఎమ్మెల్యే నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి జులై 16 ప్రభాతవార్త** ట్రాన్స్‌కో కావలి డివిజన్ నుండి కోవూరును తొలగించి ప్రత్యేకంగా ట్రాన్స్‌కో కోవూరు డివిజన్‌ను ఏర్పాటు చేస్తే ఆర్డర్ విడుదల అయినట్లు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల రైతులు ఏదైనా ట్రాన్స్‌కోకి సంబంధించిన పని వుంటే కావలి పోవల్సి వచ్చేదని దానిని గుర్తించి విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి ఈవిషయాన్ని తీసుకొని వెళ్లిన వెంటనే ఆయన స్పందించి కావలి డివిజన్ నుండి కోవూరు డివిజన్ వేరు చేసి ప్రత్యేకంగా కోవూరులో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇకపై రైతులు ,ప్రజలు కావలికి పోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఐదు మండలాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, సిఎండికి, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎస్ఇకి, అధికారులందరికి ఆ యన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నారాలోకేష్ జగన్‌మోహన్‌రెడ్డిపైన గంజాయి మాఫియా వెనుక సిఎం హస్తం ఉందని గవర్నర్‌కి వినతి పత్రం ఇచ్చాడని. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేష్ పనికట్టుకొని తిడుతున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబునాయుడు గంజాయి కింగ్ అని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత మీకుఎక్కడ వుందని ప్రశ్నించారు .భారతదేశంలో మాఫియా కింగ్ చంద్రబాబునాయుడు. కులాల చిచ్చు రగిలిచింది చంద్రబాబునాయుడు అని ఆయన స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలలో ఆదరణ చూసి ఓర్వలేక లేని పోని విమర్శలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు 6 వందల వాగ్దానాలు చేసి ఒక్క వాగ్దానం అయినా నెరవేర్చాడని ఆయన ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్యేలు గడపగడపకు కార్యక్రమానికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. పవన్‌కళ్యాణ్ ఒక పిచ్చోడని ఏమి మాట్లాడుతున్నాడో అర్ధం కావడం లేదని విమర్శించారు. రాత్రికి సూట్‌కేసు వెళితే తెల్లవారు జామున చంద్రబాబునాయుడు స్క్రిపిట్ చదివే వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఆయన విమర్శించారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ముగ్గురు కలిసినా జగన్‌మోహన్‌రెడ్డి చిటికినవేలు కూడా కదపలేరని విమర్శించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయమండలి చైర్మన్ దొడ్డం రెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎంఎస్ చైర మ్‌న్ వీరి చలపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితమ్మ, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు బెల్లం మల్లారెడ్డి, షేక్ షకిలాబేగం, కంతా అనంతమ్మ, యాదిరెడ్డి, అందెప్రత్యూషా, మైనార్టీనాయకులు షేక్ అల్లాబక్షు, మోర్ల మురళీ, మోర్ల భరత్, కౌన్సిలర్ చీర్లప్రసాద్‌యాదవ్, ట్రాన్స్‌కో ఎడి శ్రీనివాసులు, ఏఇ సురేష్, ఇన్నమూరి నంసింహారావు ,రాచూరు సత్యనారాయణ, మైనార్టీనాయకులు బాబు ,హౌసింగ్ ఏఇ పెంచలయ్య, విఆర్ఓ కళ్యాణీ, పలువురు సచివాలయం సిబ్బంది, వాలింటర్లు పాల్గొన్నారు.

## తృతీయస్దానం సాధించిన నెల్లూరు జట్టు



**బుచ్చి జులై 16 ప్రభాతవార్త** మూడోవ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సూపర్‌సెవెన్ క్రికెట్ చాంపియన్‌షిష్ సబ్ జూనియర్ బాయ్స్ నెల్లూరు జట్టు తృతీయస్దానం సాధించింది. కడపజిల్లాలోని ఒంటిమిట్టటౌన్ మున్సిఫల్ స్పోర్ట్స్ గ్రౌండ్ నందు జరిగినటువంటి మూడోవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ అంతర్‌జిల్లాల పోటీలలో నెల్లూరు జిల్లా జట్టు తృతీయ స్దానం కైవశం చేసుకుంది. ఈ సందర్బంగా క్రీడాకారులను పిడీ భీమతాటి వెంకటరమణయ్య అభినందించారు. ఈకార్యక్రమంలో కోచ్‌లు చల్లా ప్రదీప్, భరత్, కార్తీక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్ధుల ఆత్మీయ సమ్మేళనం



**ఇందుకూరుపేట, జూలై 16,ప్రభాతవార్త** మండలంలోని పల్లిపాడులో గల ప్రభుత్వ డైట్ ఆవరణ యందు ఆదివారం 1992-93 విద్యా సంవత్సరంలో టీటీసీ చదివిన పూర్వ విద్యార్ధుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఆహ్లాదకరంగా జరిగినట్లు కార్యక్రమ నిర్వాహకులు గుండాల నరేంద్రబాబు, కృష్ణయ్య, సుబ్బారావు తదితరులు తెలియజేశారు. ఈ వేడుకకు అవకాశం కల్పించిన ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రీ యూనియన్ వేడుకలకు అప్పట్లో శిక్షణ పొందిన సుమారు 100మంది విద్యార్ధులు హాజరైనట్లు వారు తెలిపారు. ముందుగా దివంగతులైన అధ్యాపకులు, విద్యార్ధుల చిత్రపటాలకు పూల దండలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్ధుల పరిచయ కార్యక్రమం జరిగింది. తర్వాత పూర్వ ఉపన్యాసకులను పుష్పమాలలు, దుశ్శాలువా, పండ్లు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు మల్లిఖార్జున, శివప్రసాద్, నారాయణ, పూర్వ అధ్యాపకులు శ్రీనివాసరావు, పీఎల్ రావు, జ్ఞానోత్తమ్, జిలాని భాషా, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, సరోజిని, నర్సింహారెడ్డి, పూర్వపు ప్రిన్సిపాల్ కుమారుడు పి.శ్రీధర్‌బాబు, ప్రస్తుత డైట్ ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కే.విజయచంద్ర పాల్గొన్నారు.

## మట్టి ట్రాక్టర్లు స్వాధీనం



**చేజర్ల, జులై16ప్రభాతవార్త:** మండలంలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న 4ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మరిడినాయుడు పేర్కొన్నారు. మండలంలోని కొట్టాలులో ఇటుక బట్టీలు ఎక్కువగా ఉన్నాయి. ఇటుకబట్టీల యజమానులు ఇటుకలను తయారు చేసేందుకు మట్టిని తోలుకుంటుంటారు. ఇటీవల ఓ బట్టీ యజమాని తన సొంత పొలంలోని మట్టిని తోలుకుంటుండగా ఎవరో ఇచ్చిన ఫిర్యాదుతో మైనింగ్ అధికారులు జెసిబి, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పెనాల్టీ విధించారు. ఈక్రమంలోనే ఆదివారం 4ట్రాక్టర్లతో మట్టి తోలుతుండగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ మరిడినాయుడు తెలిపారు.

## మండల టిడిపి సమావేశం



**బిట్రగుంట, జులై 16 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలులో మండల పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల టిడిపి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, పమిడి రవికుమార్‌చౌదరి, ఆర్‌టిఎస్ నెల్లూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ గొట్టిపాటి మనోరమ, నియోజకవర్గ ఆర్‌టిసి కోర్డినేటర్ తుమ్మల హరీష్‌లు పాల్గొన్నారు. మండల క్లస్టర్ యూనిట్‌లో హౌస్‌మ్యాపింగ్, ఓటర్ వెరిఫికేషన్, మన టిడిపి యాప్ విషయాలపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సమావేవంలో పార్టీ జిల్లా కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, నేతలు అహ్మద్‌బాషా, ఇందుపూరు తిరుపతిరెడ్డి, కాంద్ర రఘురామనాయుడు తదితర నేతలు పాల్గొన్నారు.

## డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి గొప్ప దార్శనికుడు



**కావలి, జులై 16 ప్రభాతవార్త** కావలి విశ్వోదయ, జవహర్ భారతి, ఇంజనీరింగ్ కళాశాలల వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఒక గొప్ప దార్శనికుడని కావలి మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ కొనియాడారు. కావలి వెంగళరావునగర్‌లోని డిఆర్ విశ్వోదయ సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్దులకు 60 వేల రూపాయలు విలువ చేసే బియ్యం, వంటింటి సరుకులు కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. డిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. పేద విద్యార్థులకు విద్య నందించి వారి జీవితాలలో వెలుగులు నింపాలన్న ఆశయంతో, ముందుచూపుతో కావలిలో విద్యాసంస్థల్ని నెలకొల్పారన్నారు. ఈ విద్యాలయాలలో చదువుకున్న ఎంతో మంది పేదలు, బలహీనవర్గాలు దేశ విదేశాలలో మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. ఈ కళాశాలల విద్యార్థులు అన్ని రంగాలలో వున్నారన్నారు. కావలికి ఎంతో గుర్తింపు తెచ్చిన విద్యాదాత డాక్టర్ డిఆర్ అని కొనియాడారు. ఆయన పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన కుమారులు దొడ్ల వినయ్‌కుమారెడ్డి, విద్యాధరరెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. మరో ముఖ్యఅతిధి చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ జవహర్‌భారతి పూర్వ విద్యార్థి అయినందుకు చాలా గర్వంగా వుందన్నారు. నా వంతుగా ఈ వృద్దులకు మా వైద్యశాలలో ఉచితంగా వైద్యం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి చైర్‌పర్సన్ దొడ్ల ఆదిలక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్, అమరావతి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పార్టీకి చెందిన అన్ని గ్రూపుల నుంచి మన్నెమాలను తొలగించాలి



**కావలి, జులై 16 ప్రభాతవార్త** కావలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ కాబడిన కావలి మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆయన అనుచరుడు సామంతుల సురేష్‌రెడ్డిలను పార్టీకి సంబంధించిన అన్ని గ్రూపుల నుంచి తొలగించాలని గ్రూప్ అడ్మిన్స్‌కు కావలి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో ఒక్కసారిగా మన్నెమాలతో నేటికీ సత్సంబంధాలు కొనసాగిస్తున్న కావలి పట్టణ, నియోజకవర్గంలోని కొంతమంది వైసిపి నేతలు ఖంగుతినాల్సి వచ్చింది. అయితే ఈ ఆదేశాలను చాలామంది వైసిపి నేతలు బేఖాతర్ చేసినట్లు కావలి బిపిఎస్ సెంటర్, రైల్వే రోడ్డులోని ఓ హోటల్ తదితర సెంటర్లలో బహిరంగంగా చెప్పుకోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలను తుంగలో తొక్కుతున్న కొంతమంది వైసిపి నేతలపై చర్యలు తీసుకుంటారా లేదా అన్న చర్చలు కూడా సాగుతున్నాయి.

## జిల్లాస్థాయి బాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ముక్కాల



**నెల్లూరు, జులై16 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బాడ్మింటన్ పోటీలు, రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులకు ఎంపికలను ఆంధ్రప్రదేశ్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారనాకాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ పోటీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లానుండి అండర్ 11,13,15,17,19 మెన్స్, ఉమెన్స్, సింగిల్స్, డబుల్స్, విభాగాల్లో పాల్గొనేందుకు 280 జట్లు పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. కేవలం ఒక్క షార్ నుండే 38 జట్లు పాల్గొనటం బాడ్మింటన్ క్రీడకు పెరుగుతున్న ఆదరణకు ప్రత్యక్ష్యనిదర్శమన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమాల్లో బాడ్మింటన్‌ను చేర్చటం గర్వకారణమన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు తమ అసోసియేషన్ ద్వారా పూర్తి సహాయ సహకారాఉల అందిస్తామన్నారు. అలాగే ఈనెల 22నుండి 26వరకు నిర్వహించనున్న అండర్17 రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బాగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మందచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దూడల సుధాకర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, డిఎస్‌డిఓ చీఫ్‌కోచ్ యతిరాజ్, అసోసియేషన్ నిరా ్వహకులు మద్దిపాటి ప్రసాద్‌రావు, తాళ్లపాక ప్రసాద్, రామ్మోహన్‌రావు, కోచ్ వెంకటేష్, రవి, రామన్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు కార్పొరేషన్ చైర్మన్‌ని కలిసిన సీతారామపురం నేతలు



**సీతారామపురం జులై 16 ప్రభాతవార్త** సీతారామపురం మండల వైసిపినాయకులు మాజీ మండల ఉపాధ్యక్షులు రామిశెట్టి తిరుపతయ్య నెల్లూరులోని కాపుభవనం ప్రారంబోత్సవంలో రాష్ట్ర కాపు కార్పోరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావును ఆదివారం ఆయన కలిశారు. అనంతరం మండలంలో కాపుల సంక్షేమకోసం చేపట్టాల్సిన అంశాలపై శేషగిరిరావుతో చర్చించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో కాపు సంఘంనాయకులు ఎడమ తిరపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం రిటైల్ అమ్మకాల కేంద్రాలు



**నెల్లూరు కార్పొరేషన్, జులై 16,ప్రభాతవార్త** పెరిగిన నిత్యవసరాల ధరల భారాన్ని ప్రజలపై తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం రిటైల్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని నవాబుపేట రైతు బజార్లలో ఏర్పాటు చేసిన రిటైల్ అవుట్లెట్‌ను జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీతో నిత్యవసర సరుకులు ప్రజలకు అందించేలా రైతు బజారులో ప్రత్యేక రిటైల్ కౌంటర్‌లు ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. నెల్లూరులోని నవాబు పేట, పత్తేఖాన్ పేట రైతు బజార్లలో, కావలి, కందుకూరు ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మరో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల అవసరాలను బట్టి సివిల్ సప్లయస్ ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సబ్సిడీ రిటైల్ కౌంటర్‌ల ద్వారా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా రూ.48 కే నాణ్యమైన బియ్యం, రూ.137కే నాణ్యమైన కందిపప్పు అందజేస్తున్నామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసి ఉద్యోగులకు పదోన్నతులలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**నెల్లూరు టౌన్, జులై 16 ప్రభాతవార్త** బిసి ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదోన్నతులలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోని బిసి స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం బిసి ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో శంకరయ్య మాట్లాడుతూ బిసి ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు లేక ఏ స్థాయిలో అయితే ఉద్యోగంలో చేరారో ఆ ఉద్యోగంలోనే రిటైర్ అయిపోతున్న పరిస్థితులు వున్నందున పదోన్నతులలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు లేని బిసి విద్యార్థులకు పారిశ్రామికంగా అభివృద్ధికి బిసి ఇండ్రస్టీయల్ పాలసీని ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన వారికి 50 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. బిసి విద్యార్థుల అభివృద్ధికి స్వయం ఉపాధి కింద ట్రాక్టర్లు, కార్లు, లారీలు, భారీ వాహనాలపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓ.వి.ప్రసాద్, డి.లీలామోహన్, వి.శ్రీనివాసరావు, వై.శివాజీ, ఆర్.శ్రీనివాసులు, వి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో మౌళికవసతులు కల్పించాలి



**నెల్లూరు, జులై16 ప్రభాతవార్త-విద్య** ఇందిరమ్మ కాలనీల్లో తక్షణం మౌళిక సదుపాయాలు కల్పించాలని జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక 24వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో ఆయన జనంకోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీల్లో సుమారు 3వేల కుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో కనీసం వీధి దీపాలు, సైడు కాలువలు, త్రాగునీరు, సిసి రోడ్డు, వంటి మౌళిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుండి మురుగునీరు పోయేందుకు మార్గం లేకపోవటంతో రోడ్డుపైకే వదిలేస్తున్నారని, తద్వారా అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ఎన్నికలు, మీటింగ్‌ల సమయంలో మాత్రమే వచ్చి తమను పరామర్శిస్తారని, తమ సమస్యలు ఎవ్వరికి పట్టవరి స్థానికులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్.ఆలియా, సౌమ్య, రేవంత్, సాయి, ప్రవీణ్, కిషోర్, మంజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి కోటి కుంకుమార్చనకు తరలిరండి

### - జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు



**బుచ్చి జులై 16 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఈనెల 19 వ తేది నుండి 29 వ తేది వరకు అత్యంత వైభవంగా కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్దఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు కంచికామకోటి పీఠాదిపతులు ఆశీర్వదాంతో, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో దాతల దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2018లో ఈ కోటి కుంకుమార్చన నిర్వహించడం జరిగింది. ఆదిపరాశక్తి అమ్మవారు జొన్నవాడలో కామాక్షితాయిగా వెలిసియున్నారు. కంచికోటి కామ పీఠం ప్రధా నార్చకులు 28,29 వ తేది వస్తున్నారు. ఆయన చేతి మీదుగా భస్మం తీసుకుంటే పిల్లలు లేని వారికి సంతానం కలగుతుంది, అనారోగ్యవంతులు ఆరోగ్యవంతులౌతారని ఆయన తెలిపారు. రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, కోలన్‌రాజారెడ్డి దంపతులు, వల్లూరు రవీంద్రరెడ్డి దంపతులు, బెంగుళూరు సెకండ్ డిఇజి ఇలాంటి దాతలందరి సహకారం అభినందనీయమని అన్నారు. మహాకుంభాభిషేకం 12 సంవత్సరాలకు కొకసారి, 5 సంవత్సరాలకొకసారి కోటికుంకుమార్చన కార్యక్రమం నిర్వహించాలని కంచికామకోటి పీఠాదిపతులు నిర్ణయించి వున్నారని ఆయన తెలిపారు. 2018 లో కోటి కుంకుమార్చన కార్యక్రమం చేయడం జరిగింది. మరలా ఈ సంవత్సరం జులై నెలలో కోటికుంకుమార్చన చేయడం జరుగుతుందని తెలిపారు. 8 వ శాతాబ్దంలో జగద్గురు ఆదిశంకరాచార్యులు జొన్నవాడకు వచ్చి శ్రీచక్రం ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు మహాకుంభాబిషేకం, కోటికుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచలో ఇటీవల కరోనాతో ప్రజలు విలవిలలాడిపోయారు. అందువల్ల ఇటువంటి పూజలు చేస్తే అమ్మవారు చల్లని చూపు చూస్తారని నమ్మకం అని తెలిపారు. ప్రజలందరు ఈ కోటికుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని తరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకులు, పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ గుంటూరు కామేశ్వరమ్మ, గుమ్మ రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెనుశిల లక్ష్మీనరసింహుని సన్నిధిలో అడిషనల్ ఎస్పీలు



**పెంచలకోన(రాపూరు), జులై16ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ హిమావతి, విజయవాడ విజిలెన్స్ అడిషనల్ ఎస్పి ప్రసన్నలు కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన అడిషనల్ ఎస్పీలకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. అనంతరం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి వార్లకు వారి పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆస్థానమండపంలో ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో వారికి ఆశీర్వచనాలు ఆందజేశారు. ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్ రెడ్డి స్వామి వారి తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శాలువాలను వారికి ఆందజేశారు. వీరి వెంట కండలేరు డ్యాం ఎస్ఐ పత్తిపాటి అనూషా వున్నారు.

## రెండు బైక్‌లు ఢీ నలుగురు వ్యక్తులకు గాయాలు

**రాపూరు, జులై16ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకోన్న సంఘటనలో నలుగురు వ్యక్తులకుగాయాలు ఆయ్యాయి. రాపూరులోని కోయ్యల మిల్లు వద్ద యమహా, యాక్టివా వాహనాలు ఒకదానికోకటి ప్రమాదవశాత్తూఢీ కోన్న ఘటనలో యమహాపై వున్న చిల్లకూరు మండలం, చింతవరం గ్రామ అరుంధతీవాడకు చెందిన ఉదయగిరి గణేష్, కుంచం తేజ, యాక్టివా స్కూటిపై వున్న డక్కిలి మండలం పలుగోడు ఎస్‌సీ కాలనీకి చెందిన శ్రీపురం సుధీర్, రాపూరు మండలం ఏపూరు హరిజనవాడ కాలనీకి చెందిన కోప్పుల సుమరకు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. సమాచారం అందుకున్న రాపూరు 108 సిబ్బంది క్షతగాత్రులను వైద్యచికిత్స నిమిత్తం రాపూరు క్లస్టర్ వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న సిఐ కోటేశ్వర రావు, ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌లు విచారణ నిర్వహించారు.